ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 5 మే 2024

శనివారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 46.0°C
కనిష్ఠం : 27.5°C

మిర్చి రైతు విలవిల..

- ఈ ఏడాది భారీగా పడిపోయిన ధరలు
- పెట్టుబడి కూడా రాక రైతన్న దిగాలు
- ధరలేకపోవడంతో కోల్డ్ స్టోరేజీల్లో నిల్వకు మొగ్గు
- ఏనుమాముల మార్కెట్‌లో పరిధిలో 27లక్షలకు పైగా బస్తాల నిల్వ సామర్థ్యం
- బస్తాకు రూ.160 కిరాయి కాగా, రూ.250కి పైగా వసూళ్లు
- అడ్తీదారుల గుప్పెట్లో కోల్డ్ స్టోరేజీలు!



ఏనుమాముల మార్కెట్‌కు వచ్చిన మిర్చి బస్తాలు (ఫైల్)

మిర్చి రైతు బతుకు ఆగమవుతోంది. ఆరు గాలం శ్రమించి పండించిన మిర్చికి మార్కెట్‌లో ధర లేదు. గతేడాదితో పోల్చితే ఈసారి మిర్చి ధరలు భారీగా పడిపోయాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధర కోసం ఎదురుచూస్తున్న అన్నదాతలు.. పంటను కోల్డ్‌స్టోరేజ్‌ల్లో నిల్వ చేసుకుందామంటే బస్తాపై కిరాయి మోత మోగిస్తున్నారు. అటు ధర లేక.. ఇటు స్టోరేజీల్లో పెరిగిన నిల్వ ఫీజులతో రైతులు విలవిలలాడుతున్నారు. దీంతో తక్కువ ధరకు మిర్చిని అమ్ముకోవడమా లేదా పెంచిన అధిక కిరాయి చెల్లించి కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేయడమా.. అర్థంకాక ఇబ్బందులు పడుతున్నారు. అయితే మార్కెటింగ్ అధికారులు అండతో అడ్తిదారులే కోల్డ్ స్టోరేజీలను తమ గుప్పిట్లో పెట్టుకుని రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య

- రాజ్యాంగ రక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించాలి
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య
- ఆర్ఎన్ఆర్ గార్డెన్స్‌లో కాజీపేట మండల బూత్ కమిటీ విస్తృతస్థాయి సమావేశం

వివరాలు : 7లో..

భారత్‌కు మోదీ నాయకత్వం అవసరం

- బీజేపీకి సంపూర్ణ మద్దతు అందించాలి
- మోదీ ఆశీస్సులతో వరంగల్ రూపు రేఖలను మారుస్తా
- ఏకశిల పార్కులో వాకర్స్‌తో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్


హనుమకొండ ఏకశిల పార్కులో ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్

వివరాలు : 7లో..


కొడకండ్లలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో
బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్ల మండలంలో విస్తృత ప్రచారం

వివరాలు : 7లో..

రెండో ర్యాండమైజేషన్ పూర్తి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, మే 4: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకుడు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ సమక్షం లో రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో పూర్తి చేసినట్లు వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్‌ను కలెక్టరేట్‌లో చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లోని 295 పోలింగ్ బూత్‌లకు 1,106 బ్యాలెట్ యూనిట్లు, 368 కంట్రోల్ యూనిట్లు, 413 వీవీ ప్యాట్‌లు, పాలకుర్తిలోని 296 పోలింగ్ బూత్‌లకు 1,110 బ్యాలెట్ యూని ట్లు, 370 కంట్రోల్ యూనిట్లు, 414 వీవీ ప్యాట్‌లను, వరంగల్ తూర్పులోని 230 పోలింగ్ బూ త్‌లకు 862 బ్యాలెట్ యూనిట్లు, 287 కంట్రోల్ యూనిట్లు, 322 వీవీ ప్యాట్‌లను, వర్ధన్నపేటలోని 279 పోలిం గ్ బూత్‌లకు 1,046 బ్యాలెట్ యూనిట్లు, 348 కంట్రోల్ యూనిట్లు, 390 వీవీ ప్యాట్‌లను, భూపాలపల్లిలోని 317 పోలింగ్ బూత్‌లకు 1,208 బ్యాలెట్ యూనిట్లు, 412 కంట్రోల్ యూనిట్లు, 459 వీవీ ప్యాట్‌లను ఆన్‌లైన్ ద్వారా కేటాయించామన్నారు. పరకాల, వరంగల్ పశ్చిమ అసెంబ్లీ సెగ్మెంట్లకు ఆదివారం రెండో ర్యాండమైజేషన్ చేయనున్నట్లు తెలిపారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో 42 మంది వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నందున ప్రతీ పోలింగ్ కేంద్రానికి మూడు బ్యాలెట్ యూనిట్లు కేటాయించామన్నారు. అనంతరం తపాలా శాఖ పోస్టు ద్వారా స్వీ కరించే సర్వీస్ ఓటర్ల బ్యాలెట్ పేపర్లను భద్రపరిచే బ్యాలెట్ పేపర్ బాక్స్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ శ్రీనివాస్, ఆర్డీవో సిదం దత్తు, కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్, పర్యవేక్షకులు విశ్వనారాయణ, విజయ్ సాగర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు నీట్

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో తొమ్మిది పరీక్ష కేంద్రాలు
- పరీక్ష రాయనున్న 5,445 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైతే అంతే..


తాళ్లపద్మావతి సెంటర్‌లో ఏర్పాట్లును పరిశీలిస్తున్న సిటీ కోఆర్డినేటర్ మంజులాదేవి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 4: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నీట్-2024 పరీక్ష ఆదివారం జరుగనుంది. పూర్తిగా ఆఫ్‌లైన్‌లో జరుగనున్న పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నీట్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ ఎం. మంజులా దేవి తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 5,445 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకా నున్నారు. అన్ని పరీక్షా కేంద్రాలకు ఎన్‌టీఏ ఆధ్వ ర్యంలో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్, ఫ్రిస్కింగ్ యంత్రాలు, సీసీ కెమెరాల ఏర్పాట్లు చేశారు. పరీక్షను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కో ఆర్డినేటర్ తెలిపారు.

మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు పరీక్ష ఉంటుందని, ఉదయం 11.30 నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని ఆమె చెప్పారు. అయితే మధ్యాహ్నం 1.30 దాటితే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించరని ఆమె స్పష్టం చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను ఎలాంటి పరిస్థితుల్లో పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించేది లేదని ఆమె స్పష్టం చేశారు.

పారిశుధ్య డ్రైవర్లకు అందని వేతనాలు

- మూడు మాసాలుగా జీతాలు లేక పస్తులు
- దీనావస్థలో 163 మంది డ్రైవర్ కం ఓనర్లు
- కమిషనర్ స్పందించాలని వేడుకోలు





నగరంలో పని చేస్తున్న స్వచ్ఛ ఆటో కార్మికులు

వరంగల్ కార్పొరేషన్, మే 4 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేసే స్వచ్ఛ ఆటో డ్రైవర్లకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదు. దీంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. గతంలో క్రమం తప్పకుండా నెలవారి జీతా లు బ్యాంకులలో జమ అయ్యేవని, ఇప్పుడు సక్రమంగా జీతాలు రాక తమ జీవి తాలు అగమ్యగోచరంగా మారాయని మనోవేదనకు గురవుతున్నారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు మూడు మాసాల డబ్బులు నేటికీ అందలేదని ఆరోపిస్తు న్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు కలిసి విన్నవించినా కాలయాపన చేస్తున్నారని మండిపడుతున్నారు.

163 మందికి అందని జీతాలు

వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో కాలనీల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త సేకరించేందుకు ఓనర్ కం డ్రైవర్లు 163 మంది పని చేస్తున్నారు. వీరికి నగర పాలక సంస్థ కాంట్రాక్టర్ నుంచి ఒక్కరికి నెలకు రూ.15వేల జీతంతో పాటు రూ.4వేల ఇతర అలవెన్స్‌లు ఇస్తున్నారు. అందరికీ కలుపుకుని ప్రతీ నెల రూ.30.96లక్షలు చెల్లించాల్సి ఉంది. ఇప్పటికే మూడు మాసాలకు గాను ఒక్కొక్కరికి రూ.57వేలు రావాల్సి ఉందని వెల్లడించారు. జీతాలు రాకపోవడంతో ఇల్లు గడవకపోవడంతో పాటు స్వచ్ఛ ఆటోల నెల వారి కిస్తీలు నిలిచిపోయాయని వాపోయారు. కొన్ని వాహనాలు వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్ కంపెనీలు లాక్కుని వెళుతున్నారని అసహనం చేస్తున్నారు. సంబంధిత అధికారులను అడిగితే బ్యాంకులో చెక్కు వేశామని, డబ్బులు జమవుతున్నాయని జాప్యం చేస్తున్నట్టు చెప్పారు.

కాగా, తమకు సక్రమంగా జీతాలు వచ్చే విధంగా కమిషన్ చొరవ చూపాలని స్వచ్ఛ ఆటోల సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. ఇటీవల ఎన్నికైన డ్రైవర్ల సంఘం, కార్మిక సంఘాలు సైతం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. లేదంటే ఆటోల బంద్ పాటించి కమిషనర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

మిర్చి రైతు విలవిల..!

- ఈ ఏడాది భారీగా పడిపోయిన ధరలు
- పట్టించుకోని మార్కెటింగ్ అధికారులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఈ ఏడాది మిర్చి పంట రైతులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. గతేడాది మిర్చి పంటకు భారీగా మద్దతు ధర లభించింది. ఇక ఉమ్మడి వరంగల్‌లోనే ప్రత్యేకంగా సాగు చేసే చపాట (టమాట) రకం మిర్చికి అత్యధికంగా క్వింటాల్‌కు రూ.95వేల వరకు ధర దక్కింది. మిగతా వివిధరకాల మిర్చికి కూడా ఆశించిన దానికంటే అధికంగా ధరలు రావడంతో రైతులు ఈ ఏడాది కూడా మిర్చి సాగుకే మొగ్గు చూపారు. అయితే ఈ ఏడాది వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు భారీగా పడిపోవటంతో రైతులు ఆందోళనచెందుతున్నారు. మార్కెట్‌లో వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధరకు కొనుగోలుచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఖమ్మం, మహబూబాబాద్, కేసముద్రం మార్కెట్‌లో ఉన్న ధర వరంగల్ మార్కెట్‌లో లేకపోవటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయితే గత ఏడాది వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో టమాట మిర్చి క్వింటాలుకు రూ.95వేలకుపైగా ధర పలికింది. కానీ ఈ సీజన్‌లో రూ.18వేల నుంచి రూ.40వేలు వరకే ధర రావటంతో ఎన్నో ఆశలతో టమాట మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

అలాగే అత్యధికంగా రైతులుసాగుచేసే తేజరకం మిర్చికి గతేడాది రూ.25వేల అత్యధిక ధర పలకగా ప్రస్తుతం రూ.13వేల అత్యధికంగా అమ్ముకోవాల్సి వస్తోంది. వండర్‌హాట్‌రకానికి గతేడాది రూ.42వేలు ధర ఉండగా ఈసారి కేవలం రూ.22వేలు మాత్రమే పలుకుతోంది. 341రకం మిర్చి ధర గతేడాది రూ.23వేలు ఉండగా, ఈసారి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు అమ్మకాలు చేస్తున్నారు. 5531 రకం మిర్చికి గతేడాది రూ.25వేలు ప్రస్తుతం రూ.8వేల నుంచి రూ.11వేల ధరే పలుకుతోంది. సింగల్ పట్టీ రకం మిర్చి గతేడాది రూ.45వేల వరకు ధర పలకగా ఈసారి కేవలం రూ.22వేలు అత్యధికంగా ధర ఉంది. దీపిక మిర్చి గతేడాది రూ.25వేల వరకు ధర పలకగా రూ.12వేలకు కూడా ఎవరు కొనే పరిస్థితి లేదు. ఇలా అన్ని రకాల మిర్చి ఉత్పత్తులకు ధరలు పడిపోయాయి. దీంతో దిక్కుతోచని రైతులు గిట్టుబాటు ధర వచ్చినప్పుడే మిర్చిని విక్రయించుకునేందుకు కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు.

కోల్డ్ సోరేజీల్లో దోపిడీ..

కొంతకాలంగా అధిక లాభాలు వస్తుండటంతో రైతులు మిర్చి సాగుపై దృష్టిపెట్టారు. దీంతో ఎకరానికి రూ.1.30లక్షల నుంచి రూ.1.50లక్షల వరకు పెట్టుబడి పెట్టి మిర్చి సాగు చేశారు. అయితే ఈ సారి ఆశించినస్థాయిలో మార్కెట్‌లో మిర్చి డిమాండ్ లేకుండా పోయింది. ఎక్కువ మిర్చి మార్కెట్‌కు రావటంతో పాటు విదేశాల్లో కూడా మిర్చికి డిమాండ్ లేకపోవటంతో మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో మద్దతు ధరలు లభించటంలేదు. దీంతో మిర్చి రైతులు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలకు తీసుకెళ్తున్నారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ పరిధిలో 25స్టోరేజీలు ఉండగా, సుమారు 27.50లక్షలకు ఫైగా బస్తాలను నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంది. వీటిలో సుమారు 3.60లక్షలకు పైగా పసుపుతోపాటు ఇతర పంటలను నిల్వ చేసుకున్నారు. మిగతా 24లక్షల బస్తాలను శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అయితే ఈసారి నిల్వ కోసం మిర్చి బస్తాలు అధికంగా వస్తుండటంతో కోల్డ్ స్టోరేజీలను కొంతమంది అడ్తీదారులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అప్పటికే రైతులకు పెట్టుబడికి అడ్తీదారులు సాయంచేశారు. దీంతో మార్కెట్‌కు తీసుకవచ్చిన మిర్చిని ప్రస్తుతం ఉన్న తక్కువ ధరకు విక్రయించి, అడ్తిదారులు అప్పు తీర్చాలి. లేదంటే వారు సూచించిన కోల్డ్ స్టోరేజీల్లో మిర్చి బస్తాలను నిల్వ చేయాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో చాలా మంది రైతులు తక్కువ ధరకే మిర్చిని అమ్ముకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరి కొందరు రైతులు మాత్రం కోల్డ్ స్టోరేజీల్లో నిల్వకు మొగ్గు చూపారు. గత కొన్నాళ్లుగా కోల్డ్‌స్టోరేజీల్లో నిల్వ చేసుకునే ఒక బస్తాకు రూ.160 వరకు కిరాయి చెల్లించారు. బీమా కోసం మరో రూ.8 వరకు వసూళ్లు చేసేవారు. రూ.168తో డిసెంబరు 31 వరకు ఒక బస్తా కోల్డ్ స్టోరేజీలో ఉండేది. అయితే ఈసారి కొంతమంది అడ్తీదారులు అడ్వాన్స్‌గా కోల్డ్ స్టోరేజీలను తమ ఆధీనంలో పెట్టుకోగా, మరికొందరు అడ్తీదారులకే స్టోరేజీలున్నాయి. మొత్తంగా కోల్డ్ స్టోరేజీలు అడ్తీదారుల గుప్పెట్లోనే ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. గతంలో ఒక బస్తా స్టోరేజీకి రూ.160 ఉన్న ఫీజును ఏకంగా రూ.250 నుంచి రూ.300 వరకు పెంచి వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో బస్తాపై మిర్చి రైతుల నుంచి అదనంగా ఫీజుల పేరుతో రూ.90 నుంచి రూ.140 వరకు వసూలు చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. కోల్డ్‌స్టోరేజీల్లో ఈ సీజన్‌లో 22లక్షల బస్తాల నిల్వ చేసుకునే అవకాశం ఉంది. ఈ లెక్కన సుమారు రూ.20కోట్లకు పైగా రైతుల నుంచి స్టోరేజీ ఫీజు పేరుతో అదనపు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్లో మిర్చి పంటకు సగం కూడా ధర లేక దిగాలులో ఉన్న రైతులపై కోల్డ్ స్టోరేజీల్లో అదనపు వసూళ్లతో తీవ్రంగా నష్టపోతున్నామని వాపోతున్నారు.

రైతు గోస పట్టని అధికారులు..

ఇప్పటికే మిర్చి ధరలులేక పుట్టెడు దుఃఖంలో ఉన్న రైతులకు పెరిగిన కోల్డ్ స్టోరేజీ ఫీజుల ధరలు మరింతా భారాన్ని మోపుతున్నాయి. ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ పరిధిలో 27 శీతల గిడ్డంగులు ఉంటే వీటిలో కేవలం తొమ్మిదింటిలోనే ప్రభుత్వ సబ్సిడీ అందుతుందని, మిగతా వాటితో తమకు సంబంధం లేదని మార్కెటింగ్ అధికారులు చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. శీతల గిడ్డంగుల అనుమతుల సమయంలోనే ప్రభుత్వం నిర్ణయించిన ధరలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలనే నిబంధన ఉందని రైతులు పేర్కొంటున్నారు. అడ్తీదారుల గుప్పెట్లో ఉన్న కోల్డ్ స్టోరేజీల వైపు మార్కెటింగ్ అధికారులు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎర్రటి ఎండలో తాము పడుతున్న గోస అధికారులు పట్టించుకోవటం లేదని అన్నదాతలు వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీల ధరలను తగ్గించడంతో పాటు అధిక ఫీజు వసూలు చేసిన గిడ్డంగుల యాజమానులపై చర్యలు తీసుకోవాలని, వ్యాపారులు కుమ్మక్కై రైతులకు గిట్టుబాటు ధర రాకుండా చేస్తున్న సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి రంగనాధుడి బ్రహ్మోత్సవాలు

- రామానుజ జయంతి వేడుకలు
- ముస్తాబైన 700 ఏళ్ల ఆలయం





రంగనాయక ఆలయం, మూలవిరాట్టు శ్రీరంగనాథుడు

హనుమకొండ కల్చరల్, మే 4 : హనుమకొండ బ్రాహ్మణవాడ రాగన్నదర్వాజలోని 700 యేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన రంగనాయకస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భగవత్ రామానుజుల తిరునక్షత్రోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఆలయాన్ని సుందరంగా ముస్తాబుచేశారు. తెలంగాణాలోనే అరుదైన రామానుజుల వారి సన్నిధిగా పేరున్న రంగనాథస్వామి ఆలయాన్ని ఆదివారం నుంచి అనేక మంది వైష్ణవ ప్రముఖులు, భక్తులు ఆలయాన్ని సందర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తారు.

తమిళనాడు ప్రాంతంలో ఎక్కువగా ఉండే ఆలయాల మాదిరిగా ఇక్కడి ఆలయంలో రంగనాథుడితోపాటు రామానుజులు మూలవరులుగా ఉండటం విశేషం. ఇక్కడి విగ్రహాలన్నీ ఏకశిలా నిర్మితాలే. మూలవిగ్రహం అయిన రంగనాథస్వామి వారి మకరతోరణంపై ఎక్కడా లేని విధంగా దశవతారాలు దర్శనమిస్తాయి. ఆలయ గోపురం, సింహద్వారాలు, ఇతర ఆలయాలకు ధీటుగా ప్రత్యేకంగా కనిపిస్తాయి. కాకతీయకాలానికి చెందిన రాతి కట్టడాలు ఇక్కడ కొన్ని కనువిందు చేస్తాయి. ఆలయం మొత్తం శిలా నిర్మితమైతే గోపురం మాత్రం సున్నపురాయి ఇటుకతో తయారైంది. ఇక్కడి స్వామివారు పిలిస్తే పలికి తమ కోరికలు ఈడేస్తారన్నది భక్తుల విశ్వాసం. హనుమద్గిరి రాజమందిర అని పిలిస్తే ఆ శబ్దం ద్వారా భగవంతుడు భక్తుల కోరికలు నెరవేరుస్తారన్నది విశ్వాసం. ప్రతీయేటా వైశాఖ పౌర్ణమికి ప్రత్యేక శత కలశ క్షీరాభిషేకంతోపాటు ఆలయ బ్రహ్మోత్సవాలు, రామానుజ జయంతి వేడుకలు జరగడం ఈ ఆలయం ప్రత్యేకత. ఆదివారం ఉదయం బిందె తీర్థం, అంకురారోహనం, ధ్వజరోహనంతో ప్రారంభమై రాత్రి 7గంటలకు రంగనాయస్వామి వారి కల్యాణం జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు కలకోట రాఘవాచారి, నర్సింహాచారి తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు కొనసాగే వేడుకల పర్వంలో భాగంగా 12వ తేదీన రామానుజులకు వైభవంగా అష్టోత్తర శతకలష క్షీరాభిషేకంతో వేడుకలు ఆసాంతం కానున్నాయి. ఈ వేడుకల్లో సముద్రాల శఠగోపాచార్య, టీకే శ్రీనివాసన్, హైదరాబాద్‌కు చెందిన వంశీ కృష్ణమాచార్య, తిరువరంగం దాసా శేషాచార్య, వోలేటి రవికుమారాచార్య తదితర ప్రముఖులు ఆలయంలో జరిగే ధార్మిక ఉపన్యాసాల్లో పాల్గొంటారు.

భారత్‌కు మోదీ నాయకత్వం అవసరం


కాశిబుగ్గలో మాట్లాడుతున్న అరూరి రమేష్

- బీజేపీకి సంపూర్ణ మద్దతు అందించాలి
- మోదీ ఆశీస్సులతో వరంగల్ రూపు రేఖలను మారుస్తా..
- ఏకశిల పార్కులోని వాకర్స్‌తో బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్/బాలసముద్రం, మే 4 : దేశ ప్రజలు ప్రశాంతంగా బతుకుతూ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే భారత్‌కు తిరిగి మోదీ నాయకత్వం అవసరమని వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి హనుమకొండ ఏకశిలపార్కులోని వాకర్స్‌ను అరూరి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. 11వ ఆర్థిక శక్తిగా ఉన్న భారత్‌ను మోదీ ప్రపంచంలోనే 5వ స్థాయికి తీసుకొచ్చాడని, మూడోసారి ఆశీర్వదించి మోదీని ప్రధాని చేస్తే దేశాన్ని ప్రపంచంలోనే 3వ ఆర్థిక శక్తిగా నిలబెడుతాడన్నారు. దేశం వైపు ఉగ్రవాదులు తొంగిచూడొద్దంటే మోదీని దేశ రక్షకుడిగా నియమించుకోవాలన్నారు. మోదీని విస్మరిస్తే కాంగ్రెస్ చేతిలో చిత్రహింసలు పడక తప్పదన్నారు.

కాంగ్రెస్ వస్తే కర్ఫ్యూలు, మత కల్లోలాలు, స్కామ్‌లు వెంటాడుతాయని, తద్వారా దేశ ప్రజలు ఇబ్బందులకు గురవుతారని అరూరి హెచ్చరించారు. దేశంతోపాటు వరంగల్ బాగుపడాలంటే కమలం పువ్వుగుర్తుకు ఓటు వేయాలన్నారు. దేశ ప్రజలే కాకుండా ప్రపంచంలోని ఇతర దేశాలు మోదీ కావాలని కోరుకుంటున్నారని, దేశంలో మోదీ వచ్చి వరంగల్‌లో మోదీ ప్రతినిధి లేకుంటే అభివృద్ధికి దూరమవుతామన్నారు. వరంగల్ నుంచి లోక్‌సభకు తనను పంపిస్తే 10యేళ్ల అనుభవంతో వరంగల్ రూపురేఖలను మారుస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రావుల కోమల కిషన్, డివిజన్ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, ఉషారెడ్డి, జలేందర్‌రెడ్డి, ఆదిరెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజిరెడ్డి, సీనియన్ సిటిజన్ వాకర్స్ అధ్యక్షుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తున్న కర్మయోగి మోదీ

మిల్స్‌కాలనీ : దేశం కోసం అలుపెరగక శ్రమిస్తున్న కర్మ యోగి ప్రధాని నరేంద్ర మోదీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ అర్బన్ కో ఆపరేటీవ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. కాశిబుగ్గలో బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల ప్రజల ఆదరణ చూరగొన్న మహనీయుడు మోదీ అని కొనియాడారు. రెండుసార్లు ప్రధానిగా అవినీతి, బంధుప్రీతి మచ్చుకు కూడా కనిపించని మోదీకి మరోమారు ప్రధానమంత్రిగా అవకాశం ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిన మహానుభావుడు మోదీ అని కీర్తించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అవినీతి, ఆక్రమణలు, బంధుప్రీతి, స్వార్థం తొనికిసలాడేదన్నారు. అన్ని కుంభకోణాలేనని, వేలకోట్ల అవినీతి మరక లేనని ఆరోపించారు. ఈసారి కేంద్రంలో బీజేపీ వచ్చాక మామునూరు ఎయిర్‌పోర్టును పునరుద్ధరిస్తామని, పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెసర విజయచందర్‌రెడ్డి, రత్నం సతీష్‌షా, బీజేపీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, ఆడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

మడికొండ : గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ రాంపూర్‌కు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన కరుణాకర్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు సమక్షంలో వరంగల్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చందరాజు యాదగిరి, అన్నందాస్ అశోక్, గన్నరం కుమార్, బండి వెంకటయ్య, గడ్డం సదానందం, మునిగాల వెంకటరత్నం, మునిగాల బాబు తదితరులున్నారు. కార్యక్రమంలో నాయకులు కుందూరు రాజేశ్‌రెడ్డి, మునిగాల కట్టయ్య, బొల్లికొండవినోద్, బుర్ర రాజన్‌బాబు, దువ్వ నవీన్, కొలిపాక కుమార్‌బాబు, పిట్టల రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

అభివృద్ధి చేయకుంటే మళ్లీ ఓట్లు అడగం


కాజీపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కడియం కావ్య

- కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- కాజీపేటలో కడియం కావ్య ఇంటింటి ప్రచారం

కాజీపేట, మే 4 : 'కాజీపేటను అభివృద్ధి చేయకుంటే మళ్లీ ఎన్నికల్లో ఓట్లే అడగను.. ఈ లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ ఎంపీగా కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి' అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కాజీపేట అభివృద్ధిని బీఆర్‌ఎస్ నిర్లక్ష్యం చేసిందని, కాంగ్రెస్ పార్టీ కాజీపేటను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు.

రైల్వేపరంగా సికింద్రాబాద్ తర్వాత అత్యంత ప్రాధాన్యమైన కాజీపేటను గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. కాజీపేటలో బస్టాండ్, చౌరస్తా మోడల్ జంక్షన్, ఇంటర్, డిగ్రీ కళాశాలలను నిర్మించి తీరుతామన్నారు. మతతత్వాన్ని రెచ్చకొట్టే బీజేపీకి, కుటుంబపాలనలో భూ కబ్జాలకు పాల్పడిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు బొందపెట్టాలన్నారు. రోడ్‌షోల పేరిట ప్రచారం పాల్గొంటున్న కేసీఆర్‌కు ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనలో జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో రూ.30 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు. రాబోయే రోజుల్లో కాజీపేట అభివృద్ధి పూర్తి బాధ్యత తానే తీసుకుంటానని చెప్పారు. శనివారం కాజీపేటలో జరుగనున్న కడియం కావ్య ఎన్నికల ప్రచారాన్ని విజయవంతం చేయాలని ఎమ్మె ల్యే కోరారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్లు ఎలకంటి రాములు, జక్కుల రవీందర్ యాదవ్, విజయ శ్రీరజాలీ, మాజీ కార్పొరేటర్లు గుంటి కుమారస్వామి, సుంచు అశోక్, నాయకులు ఎండీ అంకూస్, పాలడుగుల అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కావ్య ఇంటింటి ప్రచారం

వరంగల్ ఎంపీగా తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ కడియం కావ్య శనివారం ఉదయం కాజీపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాజీపేట 47, 62, 63వ డివిజన్‌లలో స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డితో కలిసి కడియం కావ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో నాయకులు సందెల విజయ్, మేరుగు రాజయ్య, బైరబోయిని రమేశ్, సిటీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కట్ల శ్రీను, కాసర్ల నగేశ్, ఎండీ అంకూస్, షేక్ అజ్గర్, పోగుల సంతోష్, మేకల ఉపేందర్, పసునూరి మనోహర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి

- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య

మడికొండ, మే 4 : హైదరాబాద్‌కు దీటుగా వరంగల్ అభివృద్ధికి కృషి చేస్తానని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య హామీ ఇచ్చారు. మడికొండలోని ఆర్‌ఎస్‌ఆర్ గార్డెన్స్‌లో శనివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన కాజీపేట మండల బూత్ కమిటీల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణతో కలిసి కడియం కావ్య పాల్గొని మాటాడారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుతోపాటు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయిస్తానన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధిరంగాల్లో వరంగల్ నగరాన్ని ఎడ్యుకేషన్ హబ్, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. మడికొండ శివారులోని డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషిచేస్తున్నారని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన హక్కులతోనే స్వేచ్ఛగా బతకగలుగుతున్నామని, అలాంటి రాజ్యాంగాన్ని మార్చాలని, రిజర్వేషన్లను రద్దు చేయాలంటున్న బీజేపీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

అలాగే బీజేపీ నుంచి దేశానికి విముక్తి కలగాలంటే రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుతోనే సాధ్యమవుతుందని కావ్య తెలిపారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ భూకబ్జాలు అందరికీ తెలిసినవేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు, దొమ్మాటి సాంబయ్య, మండల పార్టీ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, మెట్టుగుట్ట చైర్మన్ పైడపాల రఘుచందర్, నాయకులు వస్కుల శంకర్, కుర్ల మోహన్, బిల్ల రవిందర్, బైరి లింగమూర్తి, గుర్రం జ్యోతిఅమర్‌నాథ్, వస్కుల నాగరాజ్, వస్కుల భాస్కర్, రజినీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీని గద్దె దించాలి

- టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

మహబూబాబాద్‌టౌన్, మే 4: ప్రజా సమస్యలను విస్మరించి, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తూ.. కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పిలుపునిచ్చారు. దేశంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నేతలు ప్రకటనలు చేస్తున్నారని, దీంతో రిజర్వేషన్లు ఉంటాయో లేదోనన్న అనుమానం కలుగుతుందని చెప్పారు. బీజేపీ పాలకులు మేలు చేయకపోగా, దేశంలో సమస్యలు సృష్టించిందని విమర్శించారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీ వ్యవసాయ రంగంలోకి కార్పొరేట్లను తీసుకువచ్చి అన్నదాతలకు అన్యాయం చేశారని విమర్శించారు. సమావేశంలో టీజేఎస్, టీపీజేఏసీ నేతలు అంబటి శ్రీనివాస్, మైస శ్రీనివాస్ మామిడాల సత్యనారాయణ, జావిద్, పట్టాభి లక్ష్మయ్య పాల్గొన్నారు.

మొదలైన.. ఇంటి నుంచే ఓటు

- వరంగల్ లోక్‌సభ స్థానంలో 1,806 మంది దరఖాస్తు
- 121 మంది ఓటు హక్కు వినియోగం


నడికుడ మండలం చర్లపల్లిలో ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధురాలు

హనుమకొండ, మే 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకోవడం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గంలో శుక్రవారం 121 మంది తమ ఓటు హక్కును ఇంటి నుంచి వినియోగించుకున్నారు. పోలింగ్ అధికారులు శుక్రవారం నుంచి 85 యేళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి మించి వైకల్యం కలిగిన దివ్యాంగుల ఇంటి వద్దకే అధికారులు వెళ్లి ఓట్లు వేయిస్తున్నారు. వృద్ధులు, ఇందు కోసం అధికార యంత్రాంగం అన్నిఏర్పాట్లు చేసింది. అవసరమైన సిబ్బందిని నియమించింది. ఇంటి నుంచి ఓటు వేసే అవకాశాన్ని ఈనెల 3 నుంచి 8వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ఈ మేరకు ముందుగా దరఖాస్తు చేసుకోవాలి.

కాంగ్రెస్, బీజేపీలకు ఓటుతో బుద్ధి చెప్పాలి

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కొడకండ్ల మండలంలో విస్తృత ప్రచారం


పాకాలలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

కొడకండ్ల, మే 4 : కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన జనగామ జిల్లా కొడకండ్ల మండలం లక్ష్మక్కపెల్లి, పెదబావితండా, బోడోని కుంటతండా, సీఎం తండా, రామన్నగూడెం, నీలిబండ తండా, మొండ్రాయి, కొడకండ్ల, హక్యాతండా, జీబీతండా, రామవరం, రామేశ్వరం, పాకాల గ్రామాల్లో స్థానిక ముఖ్యనాయకులతో కలిసి ప్రచారం చేశారు. కొడకండ్లలో చెరువు వద్ద పని చేస్తున్న ఉపాధిహామీ కూలీలతో మాట్లాడి బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో పని చేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని సూచించారు. తెలంగాణ హక్కులను కాపాడేది ఒక్క బీఆర్‌ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. తెలంగాణ గళం పార్లమెంటులో వినిపించాలంటే బీఆర్‌ఎస్ ఎంపీల సంఖ్య అధికంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పిన కళ్లబొల్లి మాటలు విని ప్రజలు వారికి ఓటు వేశారని, కానీ ఆ పార్టీ ఇచ్చిన హామీలలో ఇప్పటివరకు ఎన్ని అమలు చేశారో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. రైతుబంధు అందరికీ రాలేదని, మహిళలకు ఇస్తానన్న నెలకు రూ.2500, రూ.2లక్షల రుణమాఫీ, రూ.500లకు గ్యాస్ సిలిండర్, కల్యాణలక్ష్మిలో అదనంగా తులం బంగారం అమలు కాలేదన్నారు. కరెంట్ సక్రమంగా వస్తోందా..? సాగు, తాగునీరుఅందుతోందా..? అంటూ జనాలను ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ 420 హామీలు ఇచ్చి అరచేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు ఎందుకు వేయాలో ఆలోచించాలన్నారు. ఆ రెండు పార్టీల వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించేలా కృషి చేయాలని సూచించారు. కన్నతల్లిలాంటి బీఆర్‌ఎస్‌ను మోసం చేసిన కడియం శ్రీహరితో పాటు అరూరి రమేష్‌కు ఓటుతో సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్‌లోకి పునరాగమనం

బీఆర్‌ఎస్ నుంచి ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పెదబావితండా గ్రామ శాఖ మాజీ అధ్యక్షుడు వాంక్డోత్ లాలూనాయక్ శనివారం తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ డి.జ్యోతి, ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సింధె రామోసీ, నాయకులు డీ.ఎ.గాంధీ నాయక్, పేరం రాము, మసురం వెంకటనారాయణ, మేటి సోమరాములు, సతీష్, ఆసిఫ్, షన్ను, దూపాటి వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

హామీలు అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటేయాలి


గన్నారంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

- కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిందే..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, మే 4 : కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు కావాలంటే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేయాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని తిర్మలాయపల్లి, గన్నారం, మైలారం, జత్తురాంతండా, గణేష్ కుంట తండా, రాగన్నగూడెం, మహబూబ్‌నగర్ గ్రామాల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్‌ఎస్ పార్టీనేనని స్పష్టంచేశారు. అందుకే పార్లమెంటులో బీఆర్‌ఎస్ గళం విప్పేలా గులాబీ దళం ఉండాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిందని, బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి సంక్షేమ కనపడిందని, కాంగ్రెస్ వచ్చాక ఆగం, అధోగతి కనిపిస్తోందని అన్నారు. రాష్ట్రాన్ని ఆగంచేసిన కాంగ్రెస్‌పార్టీ మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దని సూచించారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే ఈ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్ కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలిపారు. ఒక ఉద్యమకారుడికి ఇద్దరు మోసగాళ్లకు మధ్య జరుగుతున్న ఎన్నికలని గుర్తు చేశారు. తెలంగాణ కోసం గొంతెత్తి, తెలంగాణ హక్కులు కాపాడేది బీఆర్‌ఎస్ మాత్రమేనని అన్నారు. మార్పు అనగానే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, కానీ రుణమాఫీ, రైతుబంధు, మహిళలకు రూ.2500 వచ్చాయా అంటూ.. ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలతో అరచేతిలో వైకుంఠం చూపించిందన్నారు. ఇప్పుడు మళ్లీ కొత్తగా రుణమాఫీ పేరిట రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్లు వేసి ఓట్లు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ఎందుకు ఓటు వెయ్యాలో చెప్పకుండా దేవుడిపై ఒట్లు వేసి రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు.

కడియం శ్రీహరి బీఆర్‌ఎస్ పార్టీకి చేసిన మోసానికి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాల్సిన అవసరం ఉందని ఎర్రబెల్లి పేర్కొన్నారు. బీజేపీలో చేరిన అరూరి రమేష్ సైతం వర్ధన్నపేట నియోజకవర్గ ప్రజలను మోసం చేశాడని, వీరికి ఓటుతోనే సమాధానం చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ రాగానే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు పెరిగిపోయాయని ఆరోపించారు. రోజు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మోటార్లు కాలడం మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేరాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఇందు కోసం నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి నాయకులు కలిసికట్టుగా పనిచేయాలని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్‌ల తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పి కొట్టాలన్నారు. ప్రజలను అమాయకులను చేసి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని, వీటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రంగు కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు మునావత్ నర్సింహనాయక్, బిల్లా సుధీర్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాణ్యమైన ధాన్యాన్ని విక్రయించాలి

సంగెం, మే 4: నాణ్యత పరిమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించాలని జిల్లా పౌరసరఫరాల అధికారి శివ ప్రసాద్‌రెడ్డి కోరారు. శనివారం గవిచర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రంను జిల్లా స్థాయి అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యంను విక్రయించే సమయంలో నాణ్యత కలిగినవాటిని తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అదనపు అధికారి షాఫైసల్‌హుసైనీ, డీటీసీఎస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందిలేకుండా చూడాలి

ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి జి.రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జి.రెడ్డి

వరంగల్ వ్యవసాయం, మే 4: సరుకులు అమ్మకాని తీసుకువచ్చే రైతులకు మార్కెట్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి జి.రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మార్కెట్లోని తన చాంబర్‌లో కార్యదర్శి జి.రెడ్డి పదవీబాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి అధికారులతో సమావేశం నిర్వహించారు. మార్కెట్‌కు సంబంధించిన అన్ని విభాగాలకు, అన్ని యార్డులకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మార్కెట్లో రైతులకు టాయిలెట్స్, తాగునీరు, విశ్రాంతి భవనంలో బెడ్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. సరుకులకు భద్రత కల్పించాలని, ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఓఆర్ఎస్ సాచెట్స్ అందుబాటులో ఉంచాలని తెలిపారు. సమావేశంలో గ్రేడ్-2 కార్యదర్శి రాము, క్యాషియర్ రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, నర్సింహ, రాజేందర్, శివ, గంగాధర్, మురళీ, సాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి

టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



సిబ్బందికి పరికరాలను అందజేస్తున్న సీఎండీ వరుణ్ రెడ్డి

కరీమాబాద్, మే 4: విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తించే సిబ్బంది విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా తగిన జాగ్రత్త చర్యలు పాటించాలని టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని అండర్‌రైల్వేగేటు ఉర్సు గుట్ట సమీపంలోని ఓ ఫంక్షన్ హాల్లఓ టీఎస్ ఎన్‌పీడీసీఎల్ (తెలంగాణ రాష్ట్ర ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ) ఆధ్వర్యంలో మే1 నుంచి 7వరకు నిర్వహించే విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా విద్యుత్ శాఖలో విధులు నిర్వర్తించే సిబ్బందికి ప్రమాదాల నివారణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. వరంగల్ అర్బన్ డీఈఈ మల్లికార్జున్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా వరుణ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న సిబ్బంది తరచూ ప్రమాదాలకు గురవుతుంటారని, విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఏ ఫీడర్ మీద పని చేస్తున్నామనే విషయంలో సరైన అవగాహన కలిగి ఉండాలని, కరెంటు పోల్ ఎక్కేటప్పుడు ఎల్సీ తీసుకునే సమయంలో ఒకరి కన్నా ఎక్కువ సిబ్బంది ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో మద్యం సేవించరాదని, కరెంటు పోల్ ఎక్కిన సందర్భంలో ఫోన్ మాట్లాడుతూ పనులు చేయరాదన్నారు. అనంతరం విద్యుత్‌శాఖలో పని చేస్తున్న సిబ్బందికి పలు రకాల ఎర్త్ రాడ్, గ్లౌజులు, పలు రకాల పనిముట్లను అందజేశారు.

సమావేశంలో వరంగల్ డివిజన్ పరిధిలోని ఏఈలో, సబ్ ఇంజనీర్లు, ఏఏవోలు, లైన్‌మెన్లు, లైన్ ఇన్స్‌పెక్టర్లు, ఫోర్‌మెన్ హెల్పర్లు, ఓ అండ్ ఎం, సిబ్బంది పాల్గొని ప్రమాదాల నివారణలో వారి అనుభవాలను తెలుపుతూ, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీజీఎం కె.కిషన్, ఎస్ఈ పి.మధుసూదన్‌రావు, డీఈఈ ఎస్.మల్లికార్జున్, ఎస్ఏవో సంజీవ్‌రావు, టెక్నికల్ డీఈఈ ఆనందం, ఏడీఈ సర్వేష్‌కుమార్, ఏడీఈ పి.ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు: ఏసీపీ



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, మే 4 : లోక్ సభ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ హెచ్చరించారు. శనివారం మట్టెవాడలోని వరంగల్ ఏసీపీ కార్యాలయంలో మట్టెవాడ, ఇంతెజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గొడవలకు దిగడం, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, ఇంతెజార్‌గంజ్ సీఐ మచ్చ శివ కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టాలి:రేవూరి

గీసుగొండ, మే 4: అధికార దుర్వినియోగానికి పాల్పడి రాష్ట్రాన్ని దోచుకున్న బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలని వరంగల్ పార్లమెంటు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గొర్రెకుంటలో ఏర్పాటు పార్లమెంటు ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం గొర్రెకుంట, మొగిలిచర్ల, పోతరాజుపల్లి గ్రామాలకు చెందిన 500 మంది బీఆర్ఎస్ నాయకులు కొండేటి కొమురారెడ్డి, ఎలగొండ ప్రవీణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా వారికి రేవూరి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రచారకమిటి కన్వీనర్ ప్రొఫెసర్ గాదె దయాకర్, ఎంపీపీ భీమగాని సౌజన్య, దూపాకి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

● వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కొమ్మాలలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్ద కాంగ్రెస్ నాయకులు వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నాగారపు స్వామి, సాయిలి ప్రభాకర్, మోహన్‌రెడ్డి, గీసుగొండ మండల మహిళా అధ్యక్షురాలు జక్కుల సరిత, రాజయ్య, అశోక్ పాల్గొన్నారు.

పటిష్ట భద్రత నడుమ ఈవీఎంల కమిషనింగ్



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 4: పటిష్ట భద్రత నడుమ ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ ప్రారంభమైందని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. శనివారం వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లను అక్కడి సిబ్బందితో కలిసి పరిశీలించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ మాట్లాడుతూ.. నియోజకవర్గానికి కేటాయించబడిన మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో 21 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మొబైల్ ఫోన్‌ల అనుమతి లేకుండా మెటల్ డిటెక్టర్ల సహాయంతో సేకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణితో పాటు తహసీల్దార్ మహమ్మద్ అక్బాల్ పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న నిందితుడి అరెస్టు

కరీమాబాద్, మే 4: గంజాయి తరలిస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకొని, 2 కిలో ల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య శనివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో అరెస్టుకు సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. ఫోర్ట్‌రోడ్ జంక్షన్‌లో ఎస్సై షేక్ మహమూద్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు నడుచుకుంటూ వస్తున్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా బ్యాగు పట్టుకున్న దొరకగా, మిగతా ఇద్దరు పరారయ్యారు. బ్యాగు తనిఖీ చేయగా 2 కిలోల ఎండు గంజాయి లభించినట్లు తెలిపారు. పోలీసు విచారణలో శివనగర్ సాయిబాబా గుడి దగ్గర నివాసం ఉండే కలకోట్ల చరణ్, పారిపోయిన ఇద్దరు కొండపర్తి ఆదిత్య, అనిల్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. వీరు భద్రాచలం వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి నుంచి కేజీ రూ.5వేల చొప్పున 2కేజీల గంజాయి కొనుగోలు చేసి నగరానికి వచ్చి, గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి అమ్మేందుకు వెళ్తుండగా పట్టుబడ్డారన్నారు. గంజాయి విలువ రూ.50 వేలు ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్సైలు మునీరుల్లా, గోవర్ధన్ పాల్గొన్నారు.

నేడు 5కే రన్

వరంగల్ కలెక్టరేట్, మే 4: నేడు నిర్వహించే 5కే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఓటు వేసేలా చైతన్యం తీసుకొచ్చేందుకే ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6 గంటలకు జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు రన్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'హవాలా' కేసులో దర్యాప్తు ముమ్మరం

●హైదరాబాద్‌కు ప్రత్యేక పోలీసు బృందాలు ●శివంమోడీ, నాయుడుల కొరకు పోలీసుల గాలింపు

మట్టెవాడ, మే 4: హవాలా మార్గంలో నగదు పెట్టుబడి పెట్టి మోసం చేసిన కేసులో వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. వరంగల్ కమిషనరేట్ నుంచి ప్రత్యేక బృందాలు శనివారం హైదరాబాద్‌కు వెళ్లాయి. హైదరాబాద్‌లో శివం మోడీ, నాయుడుల ఆచూకీ కొరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నగరానికి చెందిన ఎన్.పూర్ణచందర్‌రావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పూర్ణచందర్‌రావుకు చెందిన కాటన్ మిల్లులో పనిచేస్తున్న శ్రీధర్, నల్లబెల్లికి చెందిన విష్ణులతోపాటు కొంగరి శ్రీకాంత్‌లను విచారిస్తున్నారు. హవాల రూపంలో రూ.5కోట్లు పెట్టుబడిపెడితే.. రూ.15కోట్లు ఇస్తామని ముఠా సభ్యులు పేర్కొనడంతో బాధితుడు పూర్ణచందర్‌రావు 2022 డిసెంబర్‌లో హైదరాబాద్‌లోని ముఠా సభ్యులకు కొంగరి శ్రీనివాస్ సమక్షంలో రూ. 5 కోట్లు ఇచ్చాడు. తర్వాత రూ.15కోట్లు అకౌంట్‌లో జమ అయ్యాయంటూ మెసెజ్ వచ్చిందని, చెక్ చేసుకోవాలని ముఠా సభ్యులు శివం మోడీ, నాయుడులు పూర్ణచందర్‌కు చెప్పడంతో బ్యాంక్‌కు వెళ్లి చూడగా డబ్బులు రాకపోవడంతో ఖంగుతిన్నాడు.

తర్వాత పలుమార్లు డబ్బుల కోసం ముఠాను సంప్రదించినా ఫలితం లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి, శ్రీకాంత్‌ను నిలదీయగా రూ.1.27 కోట్లు పూర్ణచందర్‌రావు అకౌంట్‌కు వేరే అకౌంట్ నుంచి పంపించాడు. మిగతా డబ్బులు ఇప్పిస్తానని అందుకు హైదరాబాద్, ముంబై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లి రావటానికి పలు దఫాలుగా పూర్ణచందర్ నుంచి రూ.55లక్షలు మళ్లీ తీసుకున్నాడు. రూ.3.73 కోట్లతో పాటు తనకు రావాల్సి డబ్బులు ఇవ్వమని అడుగుతున్నందుకు శ్రీకాంత్ బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీకాంత్ తనకు అంతర్జాతీయ మాఫియాతో సంబంధాలు ఉన్నాయని దావూద్ ఇబ్రహీం, చోటా షకీల్ ఇతర ముఠా సభ్యులతో పరిచయాలున్నాయని డబ్బులు అడిగితే చంపేస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పూర్ణచందర్‌రావు ఫిర్యాదులో పేర్కొన్నారు. హవాలా కేసులో సంబంధం ఉన్న శివం మోడీ, నాయుడు, శ్రీకాంత్‌ల వాట్సాప్ కాల్‌పై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు.

పలు కోణాల్లో విచారణ..

పూర్ణచందర్‌కు కొంగరి శ్రీనివాస్ ఎలా పరిచయం అయ్యాడు. రూ.5 కోట్లకు రూ.15 కోట్లు ఏ రూపంలో ఇస్తామన్నారు, పూర్ణచందర్‌రావు రూ.5కోట్ల నగదును ఏ విధంగా సమకూర్చాడు, హవాలాలో పెట్టుబడి పెట్టాలనే ఆలోచన పూర్ణచందర్‌రావుకు ఎవరిచ్చారు, ముఠాను ఎలా సంప్రదించారు అన్న కోణంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరా తీస్తున్నారు. బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ రూపంలో ఎంత మారిందనే అంశంపై ఆరా తీస్తున్నారు. ఈ దందాలో ఇతర రాష్ట్రాలు, విదేశాలకు చెందిన వారు ఎవరైనా ఉన్నారా అన్న కోణంలోనూ విచారణ చేపట్టారు. కొంగరి శ్రీనివాస్, పూర్ణచందర్‌రావుల ఫోన్, వాట్సాప్ కాల్ డేటాలపై ఆరా తీస్తున్నారు. హైదరాబాద్‌లోని షామీర్‌పేట, సికిందరాబాద్, బన్సీలాల్‌పేట, గాంధీనగర్, రాణిగంజ్, కవ్వాలీగూడ ప్రాంతాల్లో శివం మోడీ ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



తూర్పుకోటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ- సురేష్, తదితరులు

మిల్స్‌కాలనీ, మే 4: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 36వ డివిజన్ చింతల్‌లో బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు వేల్పుగొండ యాకయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ మసూద్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థిని సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు ఎండి. షర్ఫొద్దీన్, గుల్బ, బొజ్జ రాజ్‌కుమార్, అంకూస్, రాజారపు అనిల్, ముజ్జు, అబ్బు, గణేష్, నవీన్, యాకూబ్, జంపయ్య, గఫూర్, ఐలయ్య, సాజిద్, మాషుక్, మోహిన్, రజినికాంత్, బాలరాజు, గడ్డం శ్రీను, ప్రణీత్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని 37వ, డివిజన్ కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ-సురేష్‌లు అన్నారు. శనివారం తూర్పుకోటలోని 227 బూత్ పరిధిలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిక్ష కవిత-శ్రీకాంత్, వనపర్తి ధర్మరాజు, జెట్టి చందర్, రాజబోయిన ర మేష్, బొలు గోడ్డు అరుణ్, చరణ్, రాజమల్లు, బేర వేణు, కుమార్, సోమేశ్వర్, జనార్ధన్, మధు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో కీస్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ విద్యా సాగర్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 4: పదవ తరగతి-2024 ఫలితాల్లో పాపయ్యపేటలోని కీస్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ యాద విద్యాసాగర్ అన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సీహెచ్. విపుల్, సీహెచ్.భవ్యతో కలిసి ఆయన సత్కరించారు. కె.వికాస్ హర్ష 10 జీపీఏ సాధించి వరంగల్ టాపర్‌గా నిలువగా, ఎ.అభిరామ్ 9.8 జీపీఏ సాధించారన్నారు. 50 శాతం మంది విద్యార్థులు 9 జీపీఏ కంటే ఎక్కువ సాధించినట్లు పేర్కొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో సహకరిస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, శ్రేయోభిలాషులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలి'



27వ డివిజన్ చింతల్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

ఖిలావరంగల్, మే 4: కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, భారత కిసాన్ సభ జిల్లా కార్యదర్శి వీరగోని శంకరయ్య కోరారు. శనివారం శివనగర్‌లోని తమ్మెరభవన్‌లో రెండు సంఘాల ఎంఎ పాషా అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నందున కావ్య చేతి గుర్తుకే రైతులు ఓటు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు కోట సారయ్య, చుక్కా శోభ, రాజారాం, సూరంపల్లి రత్నాకర్‌రెడ్డి, బోడ్డుపల్లి సాయిలు, హేమలత, మల్లారెడ్డి, ఎమ్డీ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

● శివనగర్‌లోని రామాలయంలో శనివారం కడియం కావ్య కాంగ్రెస్ నాయకులు గెలుపొందాలని పూజలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కరాటే ప్రభాకర్, డివిజన్ అధ్యక్షుడు చిట్టిమళ్ళ శ్రీని వాస్, నాయకులు సారా సాంబయ్య, విజయరాంచందర్, రేణుక, రమ, కనుకుంట్ల ఉపేంద్ర, ప్రేమ, చింతల కళ, పాల్గొన్నారు. అలాగే శివనగర్‌లో కాంగ్రెస్ నాయకుడు శామంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రావుల విజయరాంచందర్, అరుణ, రాధిక, లక్ష్మి, డాక్టర్ వెంకన్న, సుధాకర్, కిరణ్, రాజు, సురేష్, సతీష్, సాయి పాల్గొన్నారు.

● వరంగల్: కడియం కావ్యకు మద్దతుగా 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మస్వామి ఆధ్వర్యంలో డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. అలాగే, 2వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కేడల పద్మజనార్దన్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో మంతిని సునీత, వలుపదాసు కృష్ణ, కర్ర కుమార్, బొలుగొడ్డు అనిల్. దామెరకొండ కర్ణాకర్, పాలకుర్తి సుమన్, సోమ అనిల్, నేరేళ్ళ అరుణ పాల్గొన్నారు.

గిర్మాజిపేట: వరంగల్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యకు మద్దతుగా శనివారం 27వ డివిజన్‌లో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో యాకుత్‌పురా, చింతల్, ఎల్‌వీఆర్ నగర్, దయానందకాలనీ, శ్రీకృష్ణకాలనీ గిర్మాజిపేట తదితర ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి కావ్యకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుండేటి శ్యాం కుమార్, కమల్, రామకృష్ణ, జస్వీర్ సింగ్, శారద, శ్రీనివాస్, విశాల్‌బాబు, అన్వేష్, ప్రదీప్, లావణ్య, నాగరాజ్, రేష్మ, సదానందం, షాబాదు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, మే 4: శ్రీభద్రకాళీ, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నాయీబ్రాహ్మణుల సేవాది కార్యక్రమాల ఆహ్వాన పత్రికను భద్రకాళీ ఆలయ ప్రధాన అర్చకులు శేషు ఆవిష్కరించారు. శనివారం ఆలయంలో అమ్మవారి ముందు ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు నాగవెల్లి సురేష్ కుమార్, శ్రీరాముల రమేష్, ముత్యాల వీరేందర్, సహదేవ్, వెంకట్, గోలనకొండ శ్రీనివాస్, శ్రీరాముల నరేందర్, శివ, శ్రీనివాస్, సుధాకర్, సాంబయ్య పాల్గొన్నారు. కాగా నాయిబ్రాహ్మణ కులబాంధవులందరూ వారి కుటుంబ సభ్యులతో అమ్మవారి సేవలో ఒక్కరోజు పాల్గొనాలని నాగవెల్లి సురేష్‌కుమార్ కోరారు.

రైలు నుంచి పడి యువకుడి దుర్మరణం



సచిన్ బీస్ (ఫైల్)

గిర్మాజిపేట, మే 4: మహారాష్ట్రకు చెందిన యువకుడు స్నేహితులతో కలిసి తిరుపతి వెంకన్న దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ శనివారం రాత్రి విలేఖరులకు తెలిపిన ప్రకారం మహారాష్ట్రలోని జల్నా జిల్లా పార్టూర్ కు చెందిన సచిన్ భీస్ (26) కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో జీవిస్తున్నాడు. మిత్రులతో కలిసి గురువారం తిరుపతికి వెళ్లాడు. శుక్రవారం దర్శనం అనంతరం సాయంత్రం పద్మావతి ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌వరంగల్‌కు బయలుదేరారు. శుక్రవారం అర్ధరాత్రి రైలు నెక్కొండ దాటి వరంగల్ వైపు వస్తుండగా వాగ్యా తండా సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందాడు. శనివారం ఉదయం ఎస్సై ఎం.అయిలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురికి తరలించి పోస్టుమార్టం అనంతరం తండ్రి అశోక్ భీస్‌కు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు

రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి

గీసుగొండ, మే 4: గొర్రెకుంట క్రాస్‌రోడ్డు కట్టమల్లన్న గుడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంగెం మండలం కోట వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ బాలరాజు(55) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... సంగెం మండలం కోట వెంకటాపూర్ గ్రామానికి చెందిన కొత్తకొండ బాలరాజు(55)20ఏళ్లుగా ఏనుమాముల మార్కెట్‌లో కూలీ పనిచేస్తున్నాడు. రోజులాగే ఉదయం బాలరాజు మార్కెట్‌కు సైకిల్‌పై వెళ్తుండగా కట్టమల్లన్న గుడి వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీ కొట్టింది. గాయపడిన బాలరాజును ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కారు గొర్రెకుంట గ్రామానికి చెందిన పాలకుర్తి శ్రీకాంత్‌దిగా గుర్తించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పవన్‌కుమార్ తెలిపారు.

మళ్లీ 'చాంబర్' ఎన్నికల సందడి

● మధ్యంతర ఉత్తర్వుల ఉపసంహరణ

● 18న ఎన్నికలు.. ఫలితాల వెల్లడి

వరంగల్ వ్యవసాయ, మే 4: వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో మళ్లీ ఎన్నికల సందడి మొదలైంది. గత నవంబరులో చాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం అనంతరం 2023-26 వరకు పదవీ కాలానికిగాను 3వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. నామినేషన్ల అనంతరం పత్రాల పరిశీలన తదుపరి పోటీ అభ్యర్థుల ప్రకటించే సమయంలో కొందరు సభ్యులు జిల్లా కోర్టుకు, అలాగే హైకోర్టుకు కేసు వేశారు. కోర్టులు 'యథాతథ స్థితి' కొనసాగించమని వచ్చిన మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయడం జరిగింది. ప్రస్తుతం జిల్లా కోర్టు, హైకోర్టు తీర్పులు వెలువరించి మధ్యంతర ఉత్తర్వులను ఉపసంహరించింది. కోర్టుల తీర్పు నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియను కొనసాగించి పూర్తి చేయుటకు శుక్రవారం చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం సమావేశమై ఆగిపోయిన ఎన్నికలను కొనసాగించుటకు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు అనుబంధ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గౌరవ ప్రధాన కార్యదర్శి, సహాయ కార్యదర్శి, కోశాధికారి అలాగే ఐదుగురు కార్యవర్గ సభ్యుల పదవులకు 18న ఎన్నికలు నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

అనుబంధ ఎన్నికల షెడ్యూల్

●ఈనెల 12న ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఇదివరకే ప్రకటించిన పోటీదారుల నామినేషన్ పత్రాల ఉపసంహరణ.

●సాయంత్రం ఆరు గంటలకు పోటీదారుల తుది జాబితా ప్రకటన. 18 ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎన్నికలు. అనంతరం ఫలితాల వెల్లడి.

ఎన్నికల వేడి..

ఓ పక్క పార్లమెంట్ ఎన్నికలు.. మరో పక్క చాంబర్ ఎన్నికలు ఐదు రోజుల తేడాతో జరగనుండడంతో ఎన్నికల వేడి మరింత రాజుకుంది. చాంబర్ ఎన్నికలంటే ప్రధాన రాజకీయ పార్టీలు తమ పార్టీ వారినే ఎన్నుకునేలా పావులు కదుపుతారు. సభలు, సమావేశాలు, నిర్వహించి పార్టీప్రతిష్ట కాపాడాలనేలా చూసేవారు. వందల్లో కార్మిక కుటుంబాలు ఉండడం, రాజకీయంగా వ్యాపారులు సహకారం ఉంటుందనే కారణంతో ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలను ప్రతీసారి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది. పార్లమెంట్, చాంబర్ ఎన్నికలు ఒకేసారి రావడంతో పార్టీలు ఏ మేరకు జోక్యం చేసుకుంటాయో చూడాలి.

పోస్టల్ బ్యాలెట్ వెరిఫికేషన్ నిబద్ధతతో చేయాలి

వరంగల్ కలెక్టరేట్, మే 4: పోస్టల్ బ్యాలెట్ వెరిఫికేషన్ నిబద్ధతతో చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో వరంగల్ పార్లమెంట్ వర్గానికి చెందిన పోస్టల్ బ్యాలెట్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒరిజినల్ బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఏమైనా ముద్రణ అచ్చులో తప్పులుంటే వెంటనే సమాచారం అందజేయాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ శ్రీకాంత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వ్యవసాయ విద్యకు మంచి భవిష్యత్'



వేడుకలను ప్రారంభిస్తున్న సుబుద్ధి

వరంగల్ వ్యవసాయం, మే 4: అగ్రికల్చర్ విద్యకు మంచి భవిష్యత్తు ఉందని ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యధర్ సుబుద్ధి అన్నారు. శనివారం వరంగల్ వ్యవసాయ కళాశాలలో ఏడో వార్షికోత్సవాన్ని కళాశాల డీన్ సీమ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సుబుద్ధి, గౌరవ అతిథులుగా పీజేటీఎస్ఏయూ విద్యా వ్యవహారాల డీన్ డాక్టర్ జెల్ల సత్యనారాయణ, వరంగల్ ప్రాంతీయ పరిశోధ సంస్థ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ ఉమారెడ్డి హాజరయ్యారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బలరాం కళాశాల వివిధ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికను సమర్పించారు. కళాశాల విద్యార్థులు సంవత్సరానికి ఏడు లక్షల ప్యాకేజీతో మంచి ప్లేస్‌మెంట్‌ను పొందారని, ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, ఆనంద్, గుజరాత్ వంటి బిజినెస్ స్కూల్‌లో సహా ఢిల్లీలోని ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వంటి అత్యుత్తమ కళాశాలలో అడ్మిషన్లు పొందారని తెలిపారు. సుబుద్ధి మాట్లాడుతూ.. వ్యవసాయం లేకపోతే మనవ మనుగడేలేదని, రాబోయే రోజుల్లో వ్యవసాయ విద్యకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు.

గుండ బ్రహ్మయ్య దేవాలయానికి విరాళం

సంగెం, మే 4 : గవిచర్లలోని గుండ బ్రహ్మయ్య దేవాలయ పునర్నిర్మాణం కోసం శనివారం గ్రామానికి చెందిన వేలూరి రాములు (వీఆర్ విద్యార్థి) సతీమణి రత్నమాల, కుమారులు అమరేంద్ర, శైలేంద్ర (యూఎస్ఏ)లు రూ. 2.16లక్షలు ఆలయ కమిటీకి విరాలం అందజేశారు. రాములు దంపతులకు చైర్మన్ కొంత యాదగిరి ఆధ్వర్యంలో కమిటీ సన్మానించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకూడదు

వర్ధన్నపేట రూరల్, మే 4 : విద్యుత్ సరఫరాలో నిరంతరం ఎలాంటి అంతరాయం రాకుండా సంబంధిత గ్రామాల అధికారులు, సిబ్బంది చూసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్‌రావు సూచించారు. శనివారం మండలంలోని ఇల్లంద లక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ వారోత్సవాల అవగాహన సదస్సులో పాల్గొన్నారు. విద్యుత్ భద్రత వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు, గృహ వినియోగదారులకు విద్యుత్ ప్రమాద విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు. అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వకుండా ప్రజలు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద, మీట ర్ల వద్ద ఎలాంటి రిపేర్లు చేయరాదని తెలిపారు. విద్యుత్ లైన్లపై పనిచేసేటప్పుడు సిబ్బంది సైతం రక్షణ పరికరాలు విని యోగించాలని సూచించారు. ఎల్సీలు తీసుకున్న తర్వాతే పనులు చేయాలని, ఎర్త్ డిశ్చార్జ్ రాడును సైతం ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ ఆనందం, డీఈ భిక్షపతి, ఏడీఈ కన్నరాజు, ఏఈలు తరుణ్, నిఖిల్, సబ్‌ఇంజనీర్లు పాల్గొన్నారు.

పోలింగ్ ఏర్పాట్లపై నివేదికలు అందజేయాలి

పార్లమెంట్ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్‌రాజ్



మహబూబాబాద్ నుంచి వీసీ నిర్వహిస్తున్న జనరల్ అబ్జర్వర్ రచిత్‌రాజ్

మహబూబాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లపై నివేదికలు అందజేయాలని మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ రచిత్‌రాజ్ అధికారులకు సూచించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మానుకోట పార్లమెంటరీ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల రిటర్నింగ్ అధికారులతో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లపై ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రచిత్‌రాజ్, జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్‌కమార్‌తో కలిసి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ ఎన్నికల అధికారులు ఎన్నికల నివేదికలను తయారు చేసి, పంపించాలని చెప్పారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఆదేశాలు పాటిస్తూ.. నేటి నుంచి జరగబోయే హోం ఓటింగ్ సజావుగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహబూబాబాద్ పార్లమెంటరీ పరిధిలో 85 సంవత్సరాలకు పైబడిన ఓటర్లు 679 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 718 మంది ఉన్నారని మొత్తం హోం ఓటింగ్‌కు 1397 మంది ఓటర్లకు ఈనెల 5 నుంచి హోం ఓటింగ్ నిర్వహించేందుకు కార్యాచరణ పూర్తయిందన్నారు. మొత్తం 106 రూట్లలో 105 టీంలతో హోం ఓటింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ వీసీలో మహబూబాబాద్ ఆర్డీవో అలివేలు, సాంఘీక సంక్షేమ శాఖ అధికారి బాలరాజు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ పూర్తి

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్‌హాల్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకుడు రచిత్‌రాజ్ సమక్షంలో.. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఆధ్వర్యంలో మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 261పోలింగ్ బూత్‌లకు సంబంధించి 661బ్యాలెట్ యూనిట్లు, 330కంట్రోల్ యూనిట్లు, 366వీవీ ప్యాట్‌లను, మహబూబాబాద్‌లోని 287 పోలింగ్ బూత్‌లకు 717 బ్యాలెట్ యూనిట్లు, 358 కంట్రోల్ యూనిట్లు, 396 వీవీ ప్యాంట్లు ఆన్‌లైన్ ద్వారా ఈవీఎంల రెండో ర్యాండమైజేషన్ చేసినట్లు వివరించారు.

నర్సంపేట నియోజకవర్గంలో 283 పోలింగ్ బూత్‌లకు 707 బ్యాలెట్ యూనిట్లు, 353 కంట్రోల్ యూనిట్లు, 396 వీవీ ప్యాట్లు, ములుగులోని 307 పోలింగ్ బూత్‌లకు 768 బ్యాలెట్ యూనిట్లు, 384 కంట్రోల్ యూనిట్లు, 430 వీవీ ప్యాట్లు, పినపాకలోని 250 పోలింగ్ బూత్‌లకు 624 బ్యాలెట్ యూనిట్లు, 312 కంట్రోల్ యూనిట్లు, 350 వీవీ ప్యాట్లు, ఇల్లందులోని 242 పోలింగ్ బూత్‌లకు 604 బ్యాలెట్ యూనిట్లు, 602 కంట్రోల్ యూనిట్లు, 338 వీవీ ప్యాట్లు, భద్రాచలంలోని 176 పోలింగ్ బూత్‌లకు 450 బ్యాలెట్ యూనిట్లు, 225 కంట్రోల్ యూనిట్లు, 252 వీవీ ప్యాట్లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మొత్తం 125 శాతం వీవీ ప్యాట్లు మొత్తంగా 140 శాతం ఆన్‌లైన్ ద్వారా ర్యాండమైజేషన్ జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ



పోలింగ్ స్టేషన్ తనిఖీచేస్తున్న నోడల్ ఆఫీసర్

వర్ధన్నపేట రూరల్, మే 4 : వర్ధన్నపేట పట్టణం పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను శనివారం ఎంసీసీ నోడల్ ఆఫీసర్, వర్ధన్నపేట కమిషనర్ ఇ.జోనా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13న ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేయకూడదని తెలి పారు. పట్టణంలోని 203 నుంచి 213 వరకు గల పోలింగ్ స్టేషన్లలో లైటింగ్, మంచి నీటి సరఫరా, ఇతర సౌకర్యాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్‌కు మాతృవియోగం

- నేడు హన్మకొండలో అంత్యక్రియలు

మహబూబాబాద్ టౌన్, మే 4 : కేంద్ర మాజీమంత్రి, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తల్లి లక్ష్మీబాయి (100) శనివారం కన్నుమూశారు. ములుగు జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీబాయి కొన్నేళ్లుగా హన్మకొండ టీచర్స్ కాలనీలోని తన కుమారుడి ఇంట్లో ఉంటుంది. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతురాలికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం. తల్లి మృతివార్త తెలుసుకున్న పోరిక బలరాంనాయక్ కొత్తగూడెం బహిరంగసభను ముగించుకుని హుటాహుటిన వరంగల్‌కు చేరుకున్నారు. కాగా, హన్మకొండ టీచర్స్ కాలనీలో ఆదివారం లక్ష్మీబాయి అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు. లక్ష్మీబాయి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

లక్ష్మీబాయి మృతికి సీఎం సంతాపం

హైదరాబాద్, మే 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ తల్లి లక్ష్మీబాయి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు శాంతిచేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

19న సామూహిక షష్టిపూర్తి మహోత్సవం

నర్సంపేట టౌన్, మే 4 : యాదగిరిగుట్టలోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో నర్సంపేట పట్టణానికి చెందిన ధరణిశ్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న నిర్వహించనున్న సామూహిక షష్టిపూర్తి మహోత్సవ కరపత్రాలను శనివారం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ ముడుంబై వెంకటాచార్యులు మాట్లాడుతూ క్రోధినామ సంవత్సరంలో జరగబోయే విపత్తులను, దోషాలను నివారణ చేసుకొని ఆరోగ్యంగా జీవించడానికి 60 సంవత్సరాల పైబడిన వారికి సామూహిక షష్టిపూర్తి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచినవారు 9885363710 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధరణిశ్రీ ఫౌండేషన్ ఆధ్యాత్మిక సభ్యులు రమాచార్యులు, రంగనాథ్, రూపావతి పాల్గొన్నారు.

సీతారాంనాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి

ఖానాపురం, మే 4 : మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీతారాంనాయక్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ మండల సీనియర్ నాయకుడు లింగబత్తుల యాకసాయన్న అన్నారు. శనివారం ధర్మరావుపేటలో సీతారాం నాయక్ గెలుపు కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తేనే ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి సీతారాం నయక్‌ను గెలిపించి తద్వార నరేంద్రమోదీని మూడోసారి ప్రధాన మంత్రిని చేయాలని కోరారు. అదేవిధంగా ఉపాధిహామీ కూలీలను కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వల్లె పురుషోత్తం, అల్వాల రవి, అటికే కుమారస్వామి, కొడిమాల యాకస్వామి, కన్నెబోయిన ఐలయ్య, తక్కళ్లపల్లి యాదగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

ఖానాపురం, మే 4 : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని వినియోదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గిరగాని సుదర్శన్ గౌడ్, స్వచ్ఛందల సంస్థల సమాఖ్య ప్రతినిధి బెజ్జంకి ప్రభాకర్ అన్నారు. వినియోగదారుల సంఘం, స్వచ్ఛంద సంస్థల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మండలంలోని రాగంపేట, కొత్తూరులో నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో బాగంగా ఉపాధి హామీ కూలీలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగిని సారంగం, వినియోగదారుల సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు వసంత, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ...

మధ్యాహ్న సమయంలో రోడ్లు నిర్మానుష్యం
ఎండవేడిమి, వడగాలులు...
ఉక్కపోత భరించలేక జనం విలవిల



కూలర్లు కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలు



నిర్మానుష్యంగా నర్సంపేట నుంచి స్టేడియం వైపువెళ్లే ప్రధాన రహదారి

నర్సంపేట, మే 4 : ఎండలు మండుతున్నాయి. ఉదయం 8గంటల నుంచే భానుడు భగభగ మంటూ నిప్పులు చెరుగుతున్నాడు. పిల్లల నుంచి వృద్ధుల వరకూ ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటలు దాటితే ఇంటి నుంచి వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో గత కొద్ది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 7గంటల సమయంలో 30నుంచి 35 డిగ్రీలున్న ఉష్ణోగ్రత మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు 40నుంచి 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో ఈ నెలాఖరు వరకు ఉష్ణోగ్రతలు మరింత పెరిగిపోతాయేమోనని జనం ఆందోళన చెందుతున్నారు.. ఏప్రిల్ మూడో వారంనుంచి దంచికొడుతున్న ఎండలు మే నెలలో చివరివరకు ఎండల పరిస్థితులు ఎలా ఉంటాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరిగి ఆందోళన చెందుతున్న ప్రజలకు వేడిగాలులు, ఉక్కపోత, ఫ్యాన్లు కూలర్ల ద్వారా వేడిగాలి వస్తుండడంతో ఇంట్లో ఉండలేక బయట తిరగలేక అయోమయం చెందుతున్నారు. పెరుగుతున్న ఎండలు, వేడి గాలుల కారణంగా 10ఏళ్లలోపు చిన్నారులు. వృద్ధు లు అతిసార (వాంతులు, విరేచనాల)కు గురై ఆస్పత్రులకు చికిత్సకోసం పరుగులు తీస్తున్నారు. మధ్యాహ్న సమయంలో ఎండలు పెరిగినప్పటికీ సాయంత్రానికి, రాత్రి వరకూ వాతావరణం చల్లబడడం లేదు. భూగర్భ జలాలు అడుగంటడం వల్లే ఎండల తీవ్రత పపెరుగుతుందని భావిస్తున్నారు. అత్యవసర పనులు ఉన్నవారే బయటకు వెళ్లాలని, ప్రజలు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

కూలర్లు, ఏసీలకు పెరుగుతున్న గిరాకీ

ఎండలు మండిపోతుండడంతో ఉపశయనం పొందడానికి కూలర్లు, ఏసీలను కొనుగోలు చేయడానికి చాలా మంది ఆసక్తి చూపుతుండడంతో ఏసీలు, కూలర్లకు గిరాకీ పెరిగింది. కూలర్లను కొనుగోలు చేయడానికి వచ్చిన వారితో కూలర్ల షాపులు కిటకిటలాడుతున్నాయి. ఎండవేడిమిని భరించలేక రూ.5వేల నుంచి రూ.9వేలు ధర పలికే కూలర్లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితులను జనం ఎదుర్కొంటున్నారు.

ఎండవేడిమి నుంచి ఉపశయనం పొందడానికి ప్రజలు శీతల పానీయాలు, కొబ్బరి బొండాలు, నిమ్మకాయ శర్బత్, మజ్జిగ షాపులను ఆశ్రయిస్తున్నారు. కరోనా బారిన పడకుండా మాస్కులను ధరించి, నెత్తికి టోపీలు పెట్టుకొని జాగ్రత్తపడుతున్నారు.

నా పనితనానికి వర్ధన్నపేట అభివృద్ధే నిదర్శనం

- దేశంలో బీజేపీతోనే మాదిగలకు న్యాయం
- వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్



ఇల్లందలో మాట్లాడుతున్న అరూరి రమేష్

వర్ధన్నపేట రూరల్, మే 4 : వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పది సంవత్సరాల పాటు నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించారని, తన పనితనానికి వర్ధన్నపేట అభివృద్ధే నిదర్శనమని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని ఇల్లందలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 8న వరంగల్‌లో నిర్వహించే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బహిరంగ సభకు మండలం నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలవడానికి అన్ని రకాలుగా సానుకూల వాతావరణం ఉందని, ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా మోదీ అనే పేరు మారుమోగుతోందన్నారు.సామాన్య ప్రజలు సైతం కరోనా సమయంలో మోదీ అందించిన సేవలను కొనియాడుతున్నారని గుర్తుచేశారు.కాంగ్రెస్ పార్టీ దళితులను అవమానపరిస్తే ప్రధాని మోదీ అక్కున చేర్చుకున్నారని తెలిపారు. అందుకు సాక్ష్యంగా ప్రదాని మోదీనే మాదిగల సభకు స్వయం రావడమని గుర్తుచేశారు. మాదిగ బిడ్డెన తనకు పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వడం గర్వకారణమని తెలిపారు. దేశంలోని దళితులకు పెద్దపీట వేస్తూ వారి సమగ్రాభివృద్ధి కోసం కృషి చేస్తున్న బీజేపీని విమర్శించడం సరికాదన్నారు. దళితుడైన రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. దక్షిణ భారతదేశం నుంచి ఇద్దరు మాదిగలను కేంద్ర మంత్రులను చేసిన చరిత్ర అందరికీ తెలుసన్నారు. కడియం శ్రీహరి టీడీపీ, బీఆర్ఎస్ పార్టీలో ఉన్నంత కాలం ఉన్నత పదవులు అనుభవించి ఏ ఒక్క దళితుడిని రాజకీయంగా ఎదగనీయకుండా చేశాడని ఆరోపించారు.

40 ఏండ్ల పాటు దళిత రిజర్వేషన్ ఫలాలు అనుభవించి, మళ్లీ వరంగల్ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరి దళిత నాయకులకు టికెట్ దక్కకుండా చేసి సిగ్గు లేకుండా పోటీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి కుటుంబానికి ఈ ఎన్నికల్లో దళితులు కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పార్లమెంటు నియోజకవర్గ ప్రజలు నిండు మనసుతో దీవించి బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేస్తుందని ముఖ్యమంత్రి హోదాలో ఉండి మాట్లాడటం సబబు కాదన్నారు. రాజ్యాంగంపై, రిజర్వేషన్లపై బీజేపీ ఎంతో నిబద్ధతో ఉందని, కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి దళితులను అణగదొక్కాలని చూస్తున్నారని, ఈ ఎన్నికల్లో గెలిస్తే దళితులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. రాజకీయ లబ్ధికోసం పార్టీలు మారి తన కూతురిని ఎంపీగా గెలిపించేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధం నరేష్, నాంపెల్లి యాకయ్య, జిల్లా కోశాధికారి వన్నాల వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'కడియం కావ్య గెలుపు నల్లేరుపై నడకే'



వర్ధన్నపేటలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట రూరల్, మే 4 : వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు నల్లేరుపై నడకేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో నిర్వహిస్తున్న ఇంటింటి ప్రచారంలో పాల్గొని, కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన మేనిఫెస్టోను తీసుకువచ్చిందని, కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద మహిళలకు రూ.లక్ష అందించడం ఖాయమన్నారు. కిసాన్ న్యాయ్ పేరుతో రైతులను ఆదుకుంటామని, పంటలకు కనీస మద్దతు ధర చట్టం తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

అరూరి రమేష్ చేసిన అవినీతి, అక్రమాలు, అకృత్యాలు,భూ కబ్జాలు ప్రజలందరికీ తెలుసని, మళ్లీ ఓట్ల కోసం వస్తున్న రమేష్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సమ్మెట సుధీర్, పోశాల వెంకన్న సిలివేరు శ్రీధర్, శ్రీపాద సతీష్, మాజీ జడ్పీటీసీ పాలకుర్తి సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని చెన్నారంలో కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట నియోజకవర్గ అధికార ప్రతినిధి బర్ల సహదేవ్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కడియం కావ్య గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బర్ల సతీష్, కల్లెపు రాజు, దొమ్మటి రాజు, మాజీ సర్పంచ్ సిద్దం లక్ష్మీనారాయణ, పెండ్యాల భిక్షపతి, ఓదెలు, రాజాలు, సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

- రాయపర్తి : మండలంలోని జింకురాం తండాలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తండా శివారులో ఉపాధి హామీ కూలీల వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి కడియం కావ్యను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు గుగులోతు శ్రీనివాస్, గోవర్ధన్ రెడ్డి, మాచర్ల ప్రభాకర్, ఏసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సర్వర్, భూక్యా వెంకన్న, గుగులోతు నిమ్మ, సేవ్య తదితరులు పాల్గొన్నారు.
- పర్వతగిరి : వరంగల్ పార్లమెంటు అభ్యర్థిగా కడియం కావ్యను గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనీల్‌రావు ఆధ్వర్యంలో మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్, నాయకులు గంగాధర్ రావు, సురేందర్‌రావు, రాంచందర్, సునీల్ రావు, ఆయా గ్రామాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాములు

సుధీర్ కుమార్‌ను గెలిపించాలి

పర్వతగిరి, మే 4 : వరంగల్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు కోరారు. శనివారం మండలంలోని సోమారం, జమాల్‌పురం, గోరుగుట్టతండా గ్రామాల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు చెప్పే మాటలేమో ఆకాశంలో ఉంటే పనులేమో పాతాళంలో ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అహంకారాన్ని ఎంపీ ఎన్నికల్లో దెబ్బకొట్టాలన్నారు. కొందరు నాయకులు తమ స్వార్థప్రయోజనాల కోసం పార్టీని వీడి వెళ్తున్నారని, నిఖార్సయిన కార్యకర్తలు ఎల్లప్పుడూ పార్టీతోనే ఉంటారన్నారు. కార్యకర్తలు కష్టపడి సుధీర్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ జితేందర్‌రెడ్డి, నాయకులు యుగేందర్ రావు, చిన్నపాక శ్రీనివాస్, ఏర్పుల శ్రీనివాస్, కరిమిళ్ల దుర్గారావు, బానోత్ వెంకన్న, పిడుగు రేణుకసాయిలు, చిన్నం లక్ష్మీనారాయణ, కొల్లూరి రవి, బూర శ్యామ్, రాపాక మధు, బాల్లె వెంకటరాజు, బానోత్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ గేట్ వాల్వ్, బోరింగ్‌లకు మరమ్మతు



రుద్రగూడెంలో భగీరథ గేట్ వాల్వ్ పనులను చేస్తున్న జీపీ సిబ్బంది

నల్లబెల్లి, మే 4 : మండలంలోని రుద్రగూడెంలో కొంతకాలం నిరుపయోగంగా ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్ గేట్‌వాల్వ్‌కు మరమ్మతును జీపీ సిబ్బంది శనివారం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పద్మనాభస్వామి మాట్లాడుతూ.. రుద్రగూడెం ప్రత్యేకాధికారి కూచన ప్రకాష్ ఆదేశానుసారం గ్రామ అభివృద్ధి, ప్రజల అవసరాల దృష్ట్యా మిషన్ భగీరథ గేట్ వాల్వ్‌ను రిపేర్ చేసి, గ్రామ ప్రజలకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. గ్రామంలో నీటి సమస్య తలెత్తకుండా, ప్రజలు నీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు గ్రామంలో నిరుపయోగంగా ఉన్న బోరింగ్‌లను రిపేర్‌చేయించామన్నారు. పంచాయతీ కార్యదర్శి పద్మనాభస్వామికి పలువురు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది ఈర్ల రవి, బూసారి అప్పయ్య, అంబి రాజు, గంగారపు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి చందా లింగయ్యకు ఎంసీపీఐయూ మద్దతు



మాట్లాడుతున్న ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఉపేందర్‌రెడ్డి

నర్సంపేట, మే 4 : ఆదివాసీ ఐక్య సంఘాల మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి చందా లింగయ్యకు ఎంసీపీఐ(యూ)పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నదని ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓంకార్ భవన్‌లో శనివారం ఎంపి అభ్యర్థి వచ్చిన సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కుసుంబ బాబూరావు అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఏజెన్సీ గిరిజనులకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, భద్రాచలంను రాజధానిగా ప్రకటించాలన్న దివంగత కమ్యూనిస్టు నేత మద్దికాయల ఓంకార్ ఆశయం మేరకు చందా లింగయ్యకు ఎంసీపీఐ యూ పార్టీ మద్దతునిస్తుందన్నారు. ఆదివాసీ ఐక్య సంఘాల మద్దతులో మహబూబాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్న చందా లింగయ్య గెలుపు కోసం ఎంసీపీఐ కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ డివిజన్ కార్యదర్శి ఎండి. రాజాసాహెబ్, జన్ను రమేశ్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, ఎంసీపీఐ నాయకులు దామసాంబయ్య, తుడుందెబ్బ నాయకులు పొడుదు శ్రీనాథ్, రమణాల లక్ష్మయ్య, ముక్తిరాజు, నరసింహారావు పాల్గొన్నారు.

నల్లబెల్లం.. రెండు ద్విచక్ర వాహనాల స్వాధీనం

నెక్కొండ, మే 4 : నెక్కొండ రైల్వే స్టేషన్ సమీపం నుంచి రెండు దిచక్ర వాహనాలపై తరలిస్తున్న 160 కిలోల నల్లబెల్లం, 20 కిలోల పటిక బెల్లం స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై మహేందర్ శనివారం తెలిపారు. సంగెం మండలం బీఆర్ఎస్ తండాకు చెందిన గుగులోతు శ్రీకాంత్, సునీత, చెన్నారావుపేటకు చెందిన బానోతు విజయ్‌కుమార్ లపై కేసులు నమోదు చేశామన్నారు. అలాగే రెండు ద్వి చక్ర వాహనాలను స్వాధీన పర్చుకున్నామని చెప్పారు.

విద్యుదాఘాతంతో మొక్కజొన్న పంట దగ్ధం

నెక్కొండ, మే 4 : మండలంలోని బంజరుపల్లికి చెందిన రైతు భూక్య వెంకన్నకు చెందిన నాలుగు ఎకరాల మొక్కజొన్న పంట విద్యుదాఘాతం కారణంగా దగ్ధమైనట్లు శనివారం గ్రామస్థులు తెలిపారు. మొక్కజొన్న చేనుపై నుంచి వెళ్లిన విద్యుత్ తీగలు బలమైన గాలులతో ఒక వైరుకు మరొక వైరు తగలి షార్టుసర్క్యూట్ కావడంతో తీగల కింద ఉన్న పంటకు అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో రూ.2లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగింది. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులు విచారణ జరిపి బాధితుడికి ఆర్థికసాయం అందించాలని రైతులు కోరారు.

ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలి

దుగ్గొండి , మే 4: పార్లమెంటు ఎన్నికలను గ్రామాల్లో ప్రశాంతంగా జరుపుకోవాలని నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీసులు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ నాయకులు ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడరాదన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్, రమణమూర్తి, మోహన్, ఎస్సై పరమేష్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

అక్కల్‌చెడలో వడగాలులతో ఇద్దరు మృతి

చెన్నారావుపేట, మే 4 : మండలంలోని అక్కల్‌చెడలో ఇద్దరు వ్యక్తులు వడగాలులతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన ఆకుల భాస్కర్(25), గ్రామ శివారు హర్యానాయక్ తండాకు చెందిన బాదవత్ నర్సింహా(100) కొద్ది కాలంగా అనారోగ్యంగా బాధపడుతున్నారు. గత రెండు రోజులుగా వీస్తున్న వడగాలులకు తట్టుకోలేక మృతి చెందారు.

రైలు నుంచి పడి యువకుడు దుర్మరణం



సచిన్ భీస్ (ఫైల్)

గిర్మాజీపేట, మే 4 : మహారాష్ట్రకు చెందిన యువకుడు స్నేహితులతో కలిసి తిరుపతి వెంకన్న దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి దుర్మరణం చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వరంగల్ జీఆర్పీ సీఐ జి.నరేష్ శనివారం రాత్రి విలేఖరులకు తెలిపిన ప్రకారం మహారాష్ట్రలోని జల్నా జిల్లా పార్తూర్‌కు చెందిన సచీన్ భీస్ (26) కూలీ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులతో జీవిస్తున్నాడు. మిత్రులతో కలిసి గురువారం తిరుపతికి వెళ్లాడు. శుక్రవారం దర్శనం అనంతరం సాయంత్రం పద్మావతి ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో వరంగల్‌కు బయలుదేరారు. శుక్రవారం అర్ధరాత్రి రైలు నెక్కొండ దాటి వరంగల్ వైపు వస్తుండగా వాగ్య తండా సమీపంలో ప్రమాదవశాత్తు రైలు నుంచి పడి మృతిచెందాడు. శనివారం ఉదయం ఎస్సై ఎం.అయిలయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం అనంతరం తండ్రి అశోక్ భీస్‌కు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ ధ్యేయం

వర్ధన్నపేట రూరల్, మే 4: భారత రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరగారి ప్రీతం ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ దీక్షకు వర్ధన్నపేట నుంచి బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తుమ్మల రవీందర్, గబ్బెట బాబు, గుండె రఘుపతి, జనగాం చంద్రమోగిలి, మల్లెపాక సమ్మయ్య, ఎల్లస్వామి, కొండేటి మధుకర్, కుమారస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలో పేదల ప్రభుత్వం రావాలి

తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ వెంకట్‌నారాయణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఉద్యమ నాయకులు

నర్సంపేట, మే 4: కేంద్రంలో పేదల ప్రభుత్వం రావాలని తెలంగాణ ఉద్యమ కారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకట్ నారాయణ అన్నారు. గత పదేళ్ళ కాలంలో నరేంద్రమోదీ సర్కార్ తెలంగాణ ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రయోజనం చేకూరే పథకాలను అమలు చేయలేదని అన్నారు. మోదీ ప్రభుత్వం కుబేరులను పెంచిపోషిస్తూ పేద వర్గాల ప్రజలపై ఆర్థిక భారాలను మోపిందని విమర్శించారు. కేంద్ర విధానాలన్నీ తిరోగమన దశలో ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర సంస్థలలో 30 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే బీసీలకు ఇవ్వాల్సిన 27శాతం ఉద్యోగాలను ఇవ్వలేదన్నారు. 2021లో జరగాల్సిన జనాభాలెక్కలు ఇప్పటి వరకు మొదలు పెట్టలేదన్నారు. దేశంలో 80 శాతం మంది పేద ప్రజలకు విద్య వైద్యం అందని ద్రాక్షలా మారిందన్నారు. మోదీ పాలనలో మహిళలు, యువకులు. కార్మికులకు. రైతులు, కూలీలకు ఎలాంటి న్యాయం జరుగలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీని సమర్థించి దేశాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ప్రజలపై ఉందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థులను గలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సోమ రాంమూర్తి, సాంబరాతి మల్లేశం, పెంద్యాల రవి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల కాంగ్రెస్, బీజేపీలను నమ్మి మోసపోవద్దు

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నెక్కొండ, మే 4 : అబద్ధాల కాంగ్రెస్ , బీజేపీను నమ్మి ప్రజలు మోసపోవద్దని బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి చెందాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని గుండ్రపల్లి, పెద్దకొర్పోలు, సూరుపల్లి, మడిపల్లి, చంద్రగొండ, బంజరుపల్లి, గొల్లపల్లి, అమిన్‌పేట, చిన్నకోర్పోలు గ్రామాలు శివారు తండాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి పోటీ చేస్తున్న కవితను అత్యధిక మేజార్టీతో గెలిపించి వంద రోజుల హామీ మాటతప్పిన కాంగ్రెస్‌కు బుద్ధిచెప్పాలని కోరారు. మాధవరెడ్డికి నిజంగా నెక్కొండ మండల ప్రజలపై ప్రేమ ఉంటే నర్సంపేటలోని సివిల్ ఆస్పత్రిని నెక్కొండకు తీసుకువచ్చి తన ప్రేమను నిరూపించుకోవాలని పెద్ది డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సంగని సూరయ్య, ఎంపీపీ జాటోతు రమేశ్, సొసైటీ చైర్మన్ మారం రాము, మాజీ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్‌రెడ్డి నాయకులు కొమ్ము రమేశ్, బొంపెల్లి రాజేశ్వర్‌రావు, రవి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.